# 6

# పునరుద్ధరణ ప్రారంభించి, తొట్రు పడిన రాజు

## యూదా రాజైన ఆసా

## (1 రాజులు 15:8-15)

"సంఘము పునరుద్ధరింపబడాలి!" ఏ యుగములోనైన ఏ సంఘమైనా ఈ మాట చెప్పవచ్చును. సంఘాలు నిష్పక్షపాతముగా ఉండవచ్చును. సంఘము సాధారణముగా, ఉప్పొంగిపోయే అభిమానముతో, తీవ్రమైన మంటతో వికసిస్తుంది. అయితే, మన కాలములో, మంటలు చల్లారినట్లున్నాయి. లవొదికయలోని సంఘములాగా (ప్రకటన 3:15, 16), కొన్ని సంఘాలు నులివెచ్చగా అయిపోయినవి, లేక సార్దిస్ లోని సంఘము (ప్రకటన 3:1), లాగా చనిపోయినవి. అలా జరిగినప్పుడు, సంఘము పునరుద్ధరింపబడాలి! సభ్యులు మొదటి ఉత్సాహమునకు పురికొల్పబడాలి.

పాతనిబంధనలో కూడ అప్పుడప్పుడు "పునరుద్ధరణ" కార్యక్రమాలు జరిగినవి. దేవుని ప్రజలు ఆయనతో నిబంధన చేశారు (నిర్గమకాండము 19). ఆయన చిత్తాన్ని నెరవేర్చుటకు ప్రజలు ఒప్పుకొన్నారు, అలాగే దేవుడు వారు తనకు విధేయత చూపినట్లయితే వారిని దీవించుటకు ఒప్పుకొన్నాడు. అలాగే ఆయన, తననుండి వైదొలగినట్లయితే, శాపాలు అనుసరిస్తాయని వారిని హెచ్చరించాడు. అప్పుడు ప్రజలు మారుమనస్సు పొంది నిబంధనను తిరిగి ప్రారంభించుకోవాలి.[1] తత్ఫలితంగా దేవుడు వారిని తిరిగి దీవిస్తాడు. నిబంధనను తిరిగి ప్రారంభించుట, పునరుద్ధరణతో సమానము.

విభజింపబడిన రాజ్యపు ప్రారంభ కాలములో, అలాంటి సమయాలలో ఒక దానిలో ఈ పునరుద్ధరణ తిరిగి ప్రారంభించుట జరిగినది. యూదా రాజ్యము, రెహబాము మరియు అబీయాము పరిపాలన క్రింద విశ్వాస భ్రష్టత్వము లోనికి కృంగిపోయింది. తరువాత సింహాసనానికి వచ్చే రాజు ఆసా, మంచి రాజు.[2] పునరుద్ధరణ ప్రారంభించుటకు ఆసా బాధ్యతగల వ్యక్తి. సంతోషకరమైన పునరుద్ధరణ కథను మనము చదివి, దాని తరువాత పరిణామాలను చూద్దాము.

### ఆసా పునరుద్ధరణను ప్రారంభించాడు[3]

#### ఆసా పరిపాలన టూకీగా చెప్పబడినది

మొదటి రాజులు 15 అధ్యాయంలో, మంచి రాజైన ఆసా కథ ఈ క్రింది మాటలతో ప్రారంభమయినది:

> అబీయాము తన పితరులతో కూడ నిద్రించగా వారు దావీదు పురమందు అతనిని సమాధిచేసిరి; అతని కుమారుడైన ఆసా అతనికి మారుగా రాజాయెను.

ఇశ్రాయేలువారికి రాజైన యరొబాము ఏలుబడియందు ఇరువదియవ సంవత్సరమున ఆసా యూదావారిని ఏలనారంభించెను. అతడు నలువదియొక సంవత్సరములు యెరూషలేమునందు ఏలుచుండెను. అతని అవ్వ పేరు మయకా, ఈమె అబీషాలోము కుమార్తె. ఆసా తన పితరుడైన దావీదువలె యెహోవా దృష్టికి యథార్థముగా నడుచుకొని పురుషగాములను దేశములోనుండి వెళ్ళగొట్టి తన పితరులు చేయించిన గ్రహములన్నిటిని పడగొట్టెను. మరియు తన అవ్వయైన మయకా అసహ్యమైన యొక దాని చేయించి, దేవతా స్తంభమొకటి నిలుపగా ఆసా ఆ విగ్రహమును చిన్నాభిన్నములుగా కొట్టించి, కిద్రోను ఓరను దాని కాల్చివేసి ఆమె పట్టపు దేవి కాకుండ ఆమెను తొలగించెను. ఆసా తన దినములన్నియు హృదయపూర్వకముగా యెహోవాను అనుసరించెనుగాని ఉన్నత స్థలములను తీసివేయక పోయెను. మరియు అతడు తన తండ్రి ప్రతిష్ఠించిన వస్తువులను తాను ప్రతిష్ఠించిన వస్తువులను, వెండియు బంగారమును ఉపకరణములను యెహోవా మందిరములోనికి తెప్పించెను (వచనము 8–15).

ఆసా పరిపాలన మొత్తము ఒక మాటలో "యెహోవా దృష్టికి యథార్థముగా నడుచుకొని" అనుదానిలో టూకీగా చెప్పబడినది. ముఖ్యంగా (1) అతడు, "పురుషగాములను దేశములోనుండి వెళ్ళగొట్టెను," (2) "విగ్రహములను ... తొలిగించెను," (3) పట్టపు దేవికాకుండ మయకాను తొలిగించెను, మరియు (4) తన సంపదను దేవుని మందిరములో నిలువజేశాడు.

**ఆసా పునరుద్ధరణ విశ్లేషింపబడినది**

రెండవ దినవృత్తాంతములు మూడు అధ్యాయములలో ఆసా పరిపాలనను విశ్లేషిస్తూ అతని కథను పొడిగించింది (14–16 అధ్యాయాలు). ఆ వృత్తాంతాన్ని మనం చదువుతూ ఉండగా, అతడు పునరుద్ధరణను ఎలా ప్రారంభించాడో మనకొక ఉద్దేశం ఏర్పడుతుంది మరియు కాబట్టి, ఈనాడు క్రైస్తవ గుంపులను పునరుద్ధరించుటకు ఎలాంటి అవసరతలు సంభవించాలో గమనిస్తాము.

*ఒక మనిషి సమర్పణతో పునరుద్ధరణ ప్రారంభించబడినది.* మొదట, ఆసా దినాలలో పునరుద్ధరణ దేవుని చిత్తాన్ని నెరవేర్చాలన్న అతని దృఢచిత్తముతో ప్రారంభించబడినట్లు 2 దినవృత్తాంతములు ఆ వృత్తాంతాన్ని దృఢపరుస్తుంది. గ్రంథకర్త, "ఆసా తన దేవుడైన యెహోవా దృష్టికి అనుకూలముగాను యథార్థముగాను నడచిన వాడై ..." (2 దినవృత్తాంతములు 14:2) అని వ్రాశాడు. అతడు దేవునికి సమర్పించుకొనుట వలన, ఆసా విగ్రహారాధనను రాజ్యములో లేకుండ తుడిచి వేయుటకు చూశాడు (2 దినవృత్తాంతములు 14:3, 5). ఆసా దేవుని మార్గముల పట్ల అత్యుత్సాహము గలవాడు గనుక మయకాను ఒక వేళ ఆమె తన సొంత అవ్వ కావచ్చును[4] – పట్టపు దేవి స్థానం నుండి తొలిగించాడు. అది ఔన్నత్యము, అధికారము కలిగిన స్థితి. అలా చేయుటలో, క్రైస్తవులు అభివృద్ధి చేసుకొవలసిన ఒక విధమైన సమర్పణను అతడు ఉదహరిస్తున్నాడు. యేసు, ఎవరైనా తన శిష్యులు కావాలంటే, తన కుటుంబముతో సహా సమస్తమును విడచిపెట్టవలెనని చెప్పాడు.[5]

ఆసా దినములలో ఒక మనిషి యొక్క సమర్పణతో పునరుద్ధరణ ప్రారంభించబడినట్లు, ఈనాడు ఒక మనిషి దర్శనముతో పునరుద్ధరణ ప్రారంభింపబడవచ్చును. ఒక భక్తిగల

క్రైస్తవుడు పునరుద్ధరణ ప్రారంభించు సామర్థ్యము కలిగియుండక పోవచ్చును, అయితే, కనీసం ఒక శిష్యుని యొక్క నిశ్చయమైన/దృఢమైన నాయకత్వము లేకుండ పునరుద్ధరణ ప్రారంభింపబడదు!

*పునరుద్ధరణ సమాజమంతటికి వ్యాపించినది.* ఆసా పునరుద్ధరణ కథ ప్రారంభమై *ఆసా విశ్వాస్యతను కనుబరుచుటతొ ఆగిపోలేదు.* అతడు తనతోపాటు మరికొందరిని దేవుని యొద్దకు తిరిగి తీసుకొని వెళ్లుటకు నిర్ణయించుకొన్నాడు. అతడు "వారి పితరుల దేవుడైన యెహోవాను ఆశ్రయించుటకును, ధర్మశాస్త్రమును బట్టియు విధినిబట్టియు క్రియలు జరిగించుటకును, యూదావారికి ఆజ్ఞాపించి ..." (2 దినవృత్తాంతములు 14:4).

అదే విధంగా, ఈనాడు ఒక వ్యక్తి సంఘమును పునరుద్ధరణకు నడిపించినట్లయితే, అతడు ఇతరులను తనతో తీసుకు వెళ్లే మార్గమును కనుగొంటాడు. దురదృష్టవశాత్తు, దేవుని వెంబడించుటకు సంఘములో నాయకుడు ప్రజలకు ఆజ్ఞాపించ లేడు.[6] అంతకంటే, ప్రయాణములో ప్రజలను తనను అనుసరించునట్లు అతడు వారిని సమ్మతింపజేయాలి. అంకిత భావము కలిగిన క్రైస్తవులు తమ వ్యక్తిగత పలుకుబడితో, బోధతో, సమ్మతితో మరియు కదలించుటతో దేవుని ప్రజలను నడిపించాలి - అంతేకాని, భయపెట్టో, పిరికితనము పుట్టించో, భౌతిక శక్తినుపయోగించో కాదు.

*దేవుని దీవెన వలన పునరుద్ధరణ విజయవంతమయినది.* అలా చెప్పిన తరువాత ఆసా, తన పాలన ప్రారంభంలోనే (సమాధానము మరియు స్పష్టమైన అభివృద్ధి ఉన్న సమయం 2 దినవృత్తాంతములు 14:6-8), పునఃర్నిమాణాలు ప్రారంభించాడు, దినవృత్తాంతాల గ్రంథకర్త ఇతియోపియా రాజు వేలవేల సైన్యమును మూడు వేల రథములను కూర్చుకొని యూద మీదకు వచ్చాడని తెలియజేశాడు (2 దినవృత్తాంతములు 14:9). యూదా చాలా తక్కువ మంది సైన్యము కలిగి ఉంది. ఆసా దేవుని కిలా ప్రార్థించాడు,

> ఆసా తన దేవుడైన యెహోవాకు మొఱ్ఱపెట్టి-యెహోవా, విస్తారమైన సైన్యము చేతిలో ఓడిపోకుండ బలములేని వారికి సహాయము చేయుటకు నీకన్న ఎవరును లేరు; మా దేవా యెహోవా, మాకు సహాయము చేయుము, నిన్నే నమ్ముకొని యున్నాము, నీ నామమును బట్టియే ఈ సైన్యమును ఎదిరించుటకు బయలుదేరి యున్నాము. యెహోవా నీవే మా దేవుడవు, నరమాత్రులను నీ పైని జయమెందనియ్యకుము అని ప్రార్థింపగా (2 దినవృత్తాంతములు 14:11).

దేవుడు ఆసా బలగాలను నిజంగా దీవించాడు (2 దినవృత్తాంతములు 14:12-15). వారు దేవునియందు నమ్మిక యుంచుట వలన, వారు ప్రతి ధ్వనించు విజయాన్ని పొందారు.

తరువాత అధ్యాయములో, ప్రవక్తయైన అజర్యా ఆసాతో, దక్షిణ రాజ్యపు ప్రజలతో మాట్లాడుతూ, "ఆసా, యూదావారలారా, బెన్యామీనీయులారా, మీరందరు నా మాట వినుడి. మీరు యెహోవా పక్షపు వారైన యెడల ఆయన మీ పక్షమున నుండును; మీరు ఆయన యొద్ద విచారణ చేసిన యెడల ఆయన మీకు ప్రత్యక్షమగును; మీరు ఆయనను విసర్జించిన యెడల ఆయన మిమ్మును విసర్జించును" (2 దినవృత్తాంతములు 15:2) అని చెప్పాడు. తరువాత ప్రవక్త ఆసాను "కాగా మీరు బలహీనులు కాక ధైర్యము వహించుడి, మీ కార్యము సఫలమగును" (2 దినవృత్తాంతముల 15:7) అని హెచ్చరించాడు.

ఆసా అనుభవము, అజర్యా మాటలు పునరుద్ధరణను గూర్చి మూడు సత్యాలను బయలు

పరుస్తున్నాయి. మొదటిది, పునరుద్ధరింపబడాలి, నూతన పరచబడాలనుకొనేవారు దేవునిపై ఆధారపడాలి. ఆయన మనకు బలాన్నిస్తాడు; మన సువార్తీకరణ ప్రయాత్నాలను ఫలవంతంగా చేయగలవాడు ఆయన మాత్రమే. ఆయన దీవెనలు లేకుండ మనము గెలుపొందులేము. రెండవది, మనము పునరుద్ధరణ కొరకు చూస్తుండగా, మనలను దీవించుటకు దేవుడు మనప్రక్క నున్నట్లయితే, మనం ప్రార్థించాల్సిన అవసరం ఉంది. ఏ సంఘములోనైనా ప్రార్థన ముందుగా వెళ్లి పునరుద్ధరణను అనుసరిస్తుంది. మూడవది, ఆయన చిత్తమును చేయుట అనగా ఆయన వాక్యమునకు విధేయత చూపినట్లయితే, దేవుడు మాత్రమే పునరుద్ధరణతో దీవించగలవాడు అని మనం గుర్తుంచుకోవాలి.

*పునరుద్ధరణ, దేవుడు అసహ్యమని ఎంచిన విషయాలను యూదా ప్రజలు తిరస్కరించాలని కోరుతుంది.* ప్రవక్తయైన అజర్యా మాటలను బట్టి ఆసా ధైర్యము వహించి, విగ్రహాలను దేశంలోనుండి తొలగించుట, పట్టపుదేవిని తొలగించుట ద్వారా పునరుద్ధరణ కార్యమును కొనసాగించాడు (2 దినవృత్తాంతములు 15:8, 16). పాత నిబంధనలో మనం చదువు ఇతర పునఃర్నిమాణాలు కూడ పాపపు ఒప్పుకొలును కలిగి ఉన్నాయి.[7]

అదేవిధంగా, ఈనాడు కూడ పునరుద్ధరణ, దేవుడు అసహ్యించుకొనే వాటిని మనం తిరస్కరించాలని కొరుతుంది – చర్యలు, వైఖరులు ఆయనకు అసహ్యమైనవి. దానిలొ ఏమి చేర్చబడి యున్నది? క్రైస్తవ జీవితములో అపవిత్రతను దేవుడు తృణీకరిస్తాడు. ఆయన విగ్రహారాధనను అనుమతించడు – మనకెంత ప్రశస్తమైనదైనా ఆయన ముందు ఉంచుట. క్రైస్తవులు మంచి పనులు చేయుటలో చురుకుగా ఉండక పోవుటను ఆయన అసహ్యించుకొంటాడు. మనము పునరుద్ధరింపబడవలెనంటే, మనం మన పాపాలను ఒప్పుకోవాలి (యాకోబు 5:16).

*పునరుద్ధరణ, నిబంధనను తిరిగి ప్రారంభించుటలో దేవుని చిత్తానికి తిరిగి సమర్పించుకొను ఫలితాన్నిస్తుంది.* ఆసా దినాలలో తిరిగి ప్రారంభించుట ఎలా జరిగిందొ 2 దినవృత్తాంతాలు వివరిస్తుంది:

> [ఆసా] యూదావారినందరిని బెన్యామీనువారినందరిని, ఎఫ్రాయము, మనష్షే షిమ్యోను గోత్రస్థానములలో నుండి వచ్చి వారి మధ్య నివసించు పరదేశులను సమకూర్చెను. అతని దేవుడైన యెహోవా అతనికి సహాయుడై యుండుట[8] చూచి ఇశ్రాయేలు వారిలో నుండి విస్తారమైన జనులు అతని పక్షము చేరిరి. ఆసా ఏలుబడియందు పదునైదవ సంవత్సరమున మూడవ నెలను వారు యెరూషలేములో కూడి తాము తీసుకొని వచ్చిన కొల్ల సొమ్ములోనుండి ఆ దినమున ఏడు వందల ఎద్దులను ఏడువేల గొఱ్ఱెలను యెహోవాకు బలులుగా అర్పించి పూర్ణ హృదయముతోను పూర్ణాత్మతోను తమ పితరుల దేవుడైన యెహోవా యొద్ద తాము విచారణ చేయుదుమనియు పిన్నలేగాని పెద్దలేగాని పురుషులేగాని స్త్రీలేగాని ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా యొద్ద విచారణ చేయనివారికందరికిని మరణము విధించుదుమనియు[9] నిష్కర్షచేసుకొనిరి. వారు ఎలుగెత్తి బొబ్బలిడుచు, మేళములతోను బూరలనాదముతోను భేరీధ్వనులతోను యెహోవా సన్నిధిని ప్రమాణము చేసిరి. ఈలాగు ప్రమాణము చేయబడగా యూదావారందరును సంతోషించిరి; వారు పూర్ణ హృదయముతో ప్రమాణముచేసి పూర్ణమనస్సుతో ఆయనను వెదకి యుండిరి. గనుక యెహోవా వారికి ప్రత్యక్షమై చుట్టునున్న దేశస్తులతో యుద్ధములు లేకుండ వారికి నెమ్మది కలుగజేసెను (2 దినవృత్తాంతములు 15:9–15).

నిబంధన యొక్క ఈ పునరుద్ధరణలో (1) వివిధ నేపథ్యంగల ప్రజల భాగస్వామ్యము, (2) దేవునికి దారాళమైన చందా ఇవ్వబడినది, మరియు (3) పూర్ణహృదయముతో పూర్ణమనస్సుతో దేవుని వెదకుదమను శపథము చేరి ఉన్నాయి.

### ... ఆయితే ఆసా తొట్రుపడ్డాడు

ఇది తెలుసుకొకుండ ఆసా కథను మనము విడచిపెట్టలేము, ప్రజలందరిలాగానే, ఆసా కూడ సంపూర్ణుడు కాడు. అతడు నెరవేర్చిన మంచిని ప్రక్కన బెడితే, అతడు జారి పడిపొయ్యాడు. అతని జీవితపు ఆకరి దినములలో అతడు తొట్రుపడ్డాడని 2 దినవృత్తాంతములు చెబుతుంది.

ఇశ్రాయేలు రాజైన బయెషా యూదావారి మీద దండెత్తి బయలు దేరి యూదా రాజైన ఆసా యొద్దకు రాకపోకలు జరుగకుండునట్లు రామాను కట్టించాడు (2 దినవృత్తాంతములు 16:1). బయెషా నుండి బెదిరింపును జయించు ప్రయత్నములో, ఆసా, దేవుని మందిరములోని, రాజనగరునందలి బొక్కసములలోని నిధులన్ని కానుకగా ఉపయోగించి, సిరియా రాజైన బెన్హదదు సహాయం కొరకు చూచాడు (16:2, 3). తత్ఫలితముగా, బెన్హదదు ఇశ్రాయేలీయులతో ఉన్న సంధిని విచ్ఛిన్నం చేసి ఉత్తర రాజ్యముపై దండెత్తాడు (16:4). అప్పుడు, "బయెషా అది విని రామాను ప్రాకారములతో కట్టించుట మానివేసి తాను చేయుచున్న పని చాలించెను" (16:5), యూదాను బెదిరించుట మాని వేశాడు. అప్పుడు ఆసా రామా పట్టణపు రాళ్ళను దూలములను ఉపయోగించి ప్రాకార పురములను కట్టించాడు (16:6).

బయెషా బెదిరింపునుండి యూదాను రక్షించుటలో ఆసా మంచి తీర్పును అనుసరించాడని మనమాలోచించవచ్చును, కాని దేవుడలా ఆలోచించలేదు. ప్రవక్తయైన హనానీ ఆసాను తప్పుబడుతూ ఇలా చెప్పాడు,

> నీవు నీ దేవుడైన యెహోవాను నమ్ముకొనక సిరయా రాజును నమ్ముకొంటివే? సిరియా రాజు యొక్క సైన్యము నీ వశమునుండి తప్పించుకొని పోయెను. బహు విస్తారమైన రథములను గుఱ్ఱపు రౌతులనుగల కూషీయులను లూబీయులను గొప్ప దండెత్తి వచ్చిరి గదా? అయినను నీవు యెహోవాను నమ్ముకొనినందున ఆయన వారిని నీ చేతికి కప్పగించెను. తనయెడల యథార్థ హృదయముగలవారిని బలపరచుటకై యెహోవా కనుదృష్టి లోకమంతట సంచారము చేయుచున్నది; ఈ విషయమందు నీవు మతి తప్పి ప్రవర్తించితివి. గనుక ఇది మొదలుకొని నీకు యుద్ధములే కలుగును (16:7బి-9).

మరోవిధంగా, ఇతియోపియులపై అతని గొప్ప విజయము నుండి దేవుడు ఎలాంటి శత్రువునైనా జయిస్తాడు అని ఆసా ఎరిగి యుండాల్సింది. ఇశ్రాయేలుకు విరోధంగా సిరియనుల సహాయాన్ని వెదుకుట ద్వారా, యూదులను కాపాడుటకు దేవుని శక్తియందు అతడు అల్ప విశ్వాసాన్ని కనుబరచాడు. దాని ఫలితంగా, యూదా ఇక ఎంత మాత్రము సమాధానాన్ని అభివృద్ధినీ ఆనందించలేదు. దానికంటే, ఆసా పరిపాలన అనంతరము యుద్ధాల రోగంతో బాధింపబడబోతుంది.

ఆసా పాపము యొక్క నిచమైన వైఖరి ఏమంటే, అతడు ప్రవక్త మాటలకు పశ్చాత్తాపముతో మారుమనస్సు పొంది ప్రతిస్పందించ లేదు. అంతేగాక, అతడు హనానీ మీద కోపపడి అతనిని బంధించాడు. అదే సమయంలో, ఆసా జనులలో కొందరిని బాధపరచెను

(2 దినవృత్తాంతములు 16:10). అతని జీవితం ముగింపులో, పాదములో జబ్బు పుట్టినప్పుడు, అతడు వైద్యుల సహాయాన్నే వెదికాడుగాని, దేవుని సహాయం కొరకు చూడలేదు (16:12)[10] ఈ విధముగా, దేవునిపై ఆధారపడుటలో అతను తప్పిపోయాడు. ఆసా మంచి మనిషే, కాని అతడు సంపూర్ణుడు కాడు. అతడు దేవునిపై తన ప్రజల విశ్వాస్యతను పునరుద్ధరించాడు, కాని అతనే తొట్రు పడ్డాడు.

గొప్పవారైన వ్యక్తులు కూడ తొట్రుపడి పాపము చేయవచ్చని ఆసా జీవితానుభవం మనకు గుర్తుచేస్తుంది. కాబట్టి, మన విశ్వాసము ఎప్పుడూ దేవునిలోనే ఉండాలి గాని ఏ మనుష్యుని యందు గాదు – అతడింత యోగ్యుడుగా, విశ్వాసిగా కనబడినప్పటికి అది పట్టించుకొకూడదు ఇంకా, "నాశనమునకు ముందు గర్వము నడచును" (సామెతలు 16:18; KJV) అను సంగతి మనం గుర్తుంచుకోవాలి. బహుశా, ఇతియోపియులపై అతని పూర్వపు విజయం అతని గర్వానికి కారణమై యుండుట వలన ఆసా పడిపోయి ఉండవచ్చును. ఒకవేళ తనలోతాను ఇలా తర్కించుకొని యుండవచ్చును, "నేనంత గొప్పవాడిని, నా సమస్యలు నేనే పరిష్కరించుకోగలను, నాకు దేవుని సహాయం గాని, ప్రవక్త సలహాగాని అక్కరలేదు. నేనొక్కడినే చేయగలను!" సహజంగానే, అతనిలాగానే మనం, మన సమస్యలను మనమే తీర్చుకోగలమని ఆలోచించుట ప్రారంభించినప్పుడు, మనం కూడ తప్పే. ఆసా తప్పిదాల నుండి మనం, మన సొంత ప్రాముఖ్యతలపట్ల ఉబ్బిపోకూడదని పాఠం నేర్చుకొవాలి, కాని, ఎల్లప్పుడూ సహాయం కొరకు దేవునిపై ఆనుకోవాలి.

## మన కొరకు పాఠాలు

మనం కొన్ని సార్లు "మరల మమ్మును పునరుద్ధరించు"[11] అని పాడుతాము. మనమెలా పునరుద్ధరింపబడుతాము? (1) ఎవరో ఒకరు నాయకత్వం వహించాలి. (2) ఉద్యమములో చేరమని అతడు ఇతరులను సమ్మతింపజేయాలి. (3) అందరూ కలిసి హృదయపూర్వకమైన ప్రార్థనతో దేవుని సహాయాన్ని వెదకాలి, ఆయన సహాయం లేకుండ ఏమి జరుగదని గుర్తించాలి. (4) అందరూ తమ పాపములను ఒప్పుకొని విడచిపెట్టాలి. (5) ప్రతి ఒక్కరు, అతని/ఆమె పూర్ణ హృదయముతో దేవుని సేవిస్తామనే ప్రతిజ్ఞను తిరిగి నిర్మించాలి. తీర్మానాన్ని నెరవేర్చినప్పుడు, సంఘములోనికి పునరుద్ధరణ, నూతనత్వం వస్తాది.

నీవు పని జేస్తూ ఆరాధించు సంఘముల మధ్య పునరుద్ధరణ అవసరమా? నీవు కార్యక్రమాన్ని ప్రారంభిస్తే, దేవుడు పునరుద్ధరణను కలిగిస్తాడు. నీవు క్రైస్తవుడవైతే, నీ హృదయములో పాపమున్నదేమో చూస్తూ, ఆ పాపాన్ని గూర్చి మారుమనస్సు పొంది, ప్రార్థనలో దేవుని పాపాక్షమాపణ వెదకుతూ, నిన్ను నీవు పరిక్షించుకొవటం ప్రారంభించాలి. నీవు నులివెచ్చని క్రైస్తవుడవైతే, పునరుద్ధరణ నీలో నుండే ప్రారంభింపబడాలి! "నిద్రించుచున్న నీవు మేల్కొని ... క్రీస్తు నీ మీద ప్రకాశించునని ఆయన చెప్పుచున్నాడు" (ఎఫెసీయులకు 5:14). దేవుడు తన కృప చొప్పున నిన్ను క్షమిస్తాడు; అప్పుడు నీవు నీ చుట్టు ఉన్నవారు అదే పునరుద్ధరణ మార్గంలో నడచునట్లు వారికి సహాయం చేయటం ప్రారంభించాలి.

## సూచనలు

[1]యెహోషువ 8; 24; 2 రాజులు 23; ఎజ్రా 10; మరియు నెహెమ్యా 8–10లో నిబంధన పునఃస్థాపన సంస్కారాలు వివరించబడినవి. [2]యూదా దక్షిణ రాజ్యము, మూడవ రాజైన ఆసా, విభజింపబడిన రాజ్యాన్ని క్రీ.పూ. సుమారు 910–869 మధ్యకాలంలో పరిపాలించాడు. [3]ఆసా పునరుద్ధరణను నడిపించాడు అను ఉద్దేశమును, హెర్బర్ట్ లోక్యర్' *All the Kings and Queens of the Bible* (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961), 118-20; మరియు Joseph Parker, "Asa," in *Bible Characters,* by Dwight Lyman Moody, T. De Witt Talmage, and Joseph Parker (Chicago: Thomas W. Jackson Publishing Co., 1902; reprint, Grand Rapids, Mich.: Zondervan Publishing House, n.d.), 314-20లో సూచించబడినది. [4]2 దినవృత్తాంతములు 15:16 మరియు 1 రాజులు 15:10 రెండూ మయకా ఆసా తల్లి అని చెప్పుచున్నవి. అయితే, 1 రాజులు 15:2 మయకా అబీయాము (ఆసా తండ్రి) తల్లి అని చెప్పుట వలన మరియు 2 దినవృత్తాంతములు 11:20, 21 మయకా అబ్శాలోము కుమార్తె, మరియు రెహబాము భార్యయని, అబీయాము తల్లని, ఆసా అవ్వ అని చెప్పుట సాధ్యము. అలా అయితే, 1 మరియు 2 రాజులలో "తల్లి" అను మాట "అవ్వ" అను భావముతో వాడబడినది. ఎలాగంటే, కొన్ని సార్లు పితరుని సూచించుటకు "తండ్రి" అని వాడినట్లు. [5]లూకా 14:25, 26 చూడుము. [6]అయినప్పటికి, దేవుని వాక్యం ఏమి కోరుతుందో లేక ఆజ్ఞాపిస్తుందో దానిని అతడు వారికి బోధించవచ్చును. [7]ఈ పునరుద్ధరణలు ఎజ్రా, నెహెమ్యా గ్రంథాలలో వివరించబడినవి. [8]ఎఫ్రాయిము, మనష్షే, మరియు సిమ్యోను గోత్రాలు ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలులో భాగము. ఈ పాఠ్య భాగము, దేవుడు యూదా రాజ్యమును, ఆసాను దీవిస్తున్నాడని ఈ గోత్రాల ప్రజలు కొందరు చూచినప్పుడు, ఎక్కడ సత్య దేవుడు ఆరాధింపబడుతున్నాడో, ఆ యూదా దేశములో నివసించుటకు ఇశ్రాయేలు దేశమునుండి వలసవచ్చినారు. [9]ఆయన నిబంధనను మీరుట ద్వారా … యెహోవా దృష్టికి కీడు చేసిన "వారు" ఎవరైనా రాళ్ళతో కొట్టి చంపాలని మోషే ధర్మశాస్త్రము చెబుతుంది (ద్వితీయోపదేశకాండము 17:2–6). [10]"రాజు పాపము, చివరకు సమస్త మానవ రోగాలను స్వస్థపరిచే 'దేవుని సహాయాన్ని' వెదకనివ్వక, మానవుని (వైద్యుని) ఆశ్రయించేలా చేసింది (2 రాజులు 20:5; కీర్తనలు 103:3)" (J. Barton Payne, "1, 2 Chronicles," in *The Expositor's Bible Commentary*, vol. 4, *1 Kings-Job* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1988], 491). దేవుని ప్రజలు వైద్యుని సహాయం పొందటం తప్పని ఈ వాక్య భాగం గాని లేక ఇతర వాక్య భాగాలు గాని చెప్పుటలేదు.

[11]William P. MacKay, "We Praise Thee, O God," *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).